మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దాం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో, అప్పటి ముఖ్యమంత్రి జగనన్న సారథ్యంలో నిర్మించిన మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణ చేస్తున్న కూటమి ప్రభుత్వం నిర్వాకాన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కోరారు. పేద మెరిట్ విద్యార్థులకు వైద్యవిద్య, పేదలకు ఉచితంగా వైద్యం అందించేందుకు రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు, అనుబంధంగా ఆసుపత్రుల నిర్మాణానికి గత ప్రభుత్వం పూనుకుని ఏడింటిని పూర్తిచేసినట్టు గుర్తుచేశారు. ప్రజల డబ్బుతో నిర్మించిన కాలేజీలను ప్రైవేటుకు అప్పగించటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమ పోస్టరును శుక్రవారం పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి శివకుమార్ ఆవిష్కరించారు.

అనంతరం విలేకరులతో మాట్లాడుతూ విద్య, వైద్యం, రక్షణ, ఆర్టీసీ, రవాణా వ్యవస్థలను ప్రభుత్వమే నిర్వహించాలని అప్పుడే ప్రజలకు మెరుగైన సదుపాయాలు ఏర్పడతాయని గుర్తుచేశారు. దురదృష్టవశాత్తూ కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనులతో సహా గత ప్రభుత్వం నిర్మించిన మెడికల్ కాలేజీలను సైతం ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తోందని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఫీజు ప్రవేశపెట్టిన రీయింబర్స్‌మెంట్‌తో పేదింటి పిల్లలు ఎందరో ఉన్నత చదువులు చదివారని గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యం అందిందని చెప్పారు. ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ సేవల వ్యయాన్ని రూ.25 లక్షలకు విస్తరించి, వైద్య విద్య, ఉచిత వైద్యం కోసం మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని చేపట్టారని తెలిపారు. ఇప్పుడు అన్నింటినీ ప్రైవేటీకరిస్తామని కూటమి పార్టీల నేతలు చెబుతున్నారనీ, ఆరోగ్యశ్రీ కింద ప్రైవేటు ఆసుపత్రులకు ఇవ్వాల్సిన రూ.3 వేల కోట్లను విడుదల చేయకపోవటంతో ఆ సేవల బంద్‌కు పిలుపిచ్చారని గుర్తుచేశారు. కోటి సంతకాల సేకరణలో ప్రజలు పాల్గొని మద్దతునీయాలని కోరారు. తెనాలి, కొల్లిపర మండలాల పార్టీ అధ్యక్షులు చెన్నుబోయిన శ్రీనివాసరావు, కల్లం వెంకటప్పారెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు కొత్త యశోద, షేక్ రహిమా, చుక్కా ఆనంద్, మాలేపల్లి లక్ష్మయ్య, మైలా విజయ్‌నాయుడు, పెచ్చింగ్ సుభాని, మల్లెబోయిన రాము, కొమ్ము రాయల్, ఎంపీటీసీ కోపల్లె సురేష్, కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు మాట్లాడారు. పార్టీ నాయకులు కొడాలి క్రాంతి, బొంతు నరేంద్రరెడ్డి, కఠారి హరీష్, సిరికృష్ణ, కాకి దేవసహాయం, మన్నవ ప్రభాకర్, వంపుగళ్ల కృష్ణ, కావేటి నిర్మల, కొంగర రాగమంజరి తదితరులు పాల్గొన్నారు.

‘అమెరికా ఆధిపత్యాన్ని నిలువరిద్దాం’

కరపత్రం విడుదల చేసిన సీపీఎం



తెనాలి: సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ‘అమెరికా ఆధిపత్యంను నిలువరించి, మన దేశ ప్రజల ప్రయోజనాలను పరిరక్షించుకుందాం’ అంటూ ప్రజావినతి కరపత్రాన్ని ఆవిష్కరించారు. సీపీఎం తెనాలి పట్టణ కమిటి కార్యదర్శి కె.బాబూ ప్రసాద్ మాట్లాడుతూ అమెరికా నేడు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని చెప్పారు. ఆ భారాన్ని ప్రపంచదేశాలపై వేసి తాము ఒడ్డున పడాలని చూస్తున్నారని చెప్పారు. అందులో భాగంగానే మన ఎగుమతులపై అడ్డగోలు సుంకాలు మోపుతున్నారని ఆరోపించారు. వస్త్రాలు, రొయ్యలు, చేపలు, తోలు ఉత్పత్తులు, వజ్రాభరణాలు, మందులు, సినీపరిశ్రమపై యాభై శాతం సుంకాలను అమెరికా విధించిందని గుర్తుచేశారు. దీనివల్ల మన పరిశ్రమలకు తీవ్ర నష్టమని చెప్పారు. మరో వైపు రష్యా నుంచి ఆయిల్ దిగుమతి చేసుకోరాదంటూ, 50 శాతం అదనంగా టాక్స్ కట్టాలని హుకుం జారీ చేశారని చెబుతూ ఆ రకంగా మన దేశ సార్వభౌమత్వం మీద దాడి చేస్తున్నారని విమర్శించారు. ట్రంప్ విధానాలను అడ్డు కోవడంలో మనం విఫలమయ్యామనీ, చైనా, మెక్సికోలాంటి దేశాలు ఎదురు తిరిగితే, అమెరికా వాటితో రాజీ చేసుకుందని తెలిపారు.

సీపీఎం తెనాలి రూరల్ కమిటీ కార్యదర్శి ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ ట్రంప్ విధిస్తున్న సుంకం పెంపువల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. పాడి రైతులు దివాలా తీస్తారనీ, పౌల్ట్రీ పరిశ్రమ దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. దేశభక్తి గురించి మాట్లాడే బీజేపీ, అమెరికా మనకు ఇంత అన్యాయం చేస్తున్నా, మాట్లాడటం లేదన్నారు. ప్రధాని మోదీని బలపరుస్తున్న కూటమి నాయకులు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో నోరు విప్పటం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు షేక్ హుస్సేన్ వలి, జి.వెంకటసుబ్బయ్య, ఆర్.రాజశేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బోధనేతర పనులు తగ్గించాలి



కొల్లిపర: ప్రభుత్వం ఉపాధ్యాయులపై బోధనేతర పనులు తగ్గించకపోతే రేపటి నుంచి బోధన నేతల పనులన్నింటినీ బాయికాట్ చేయడం జరుగుతుందని మండల ఉపాధ్యాయుల ఫ్యాక్టో తరపున శుక్రవారం మండల కేంద్రంలో ఎంఈఓ1 ఐ వెంకటేశ్వర్లు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రతాప్, ఎస్.రామచంద్రయ్య, రమేష్, మృత్యుంజయరావు, రాము, ఏడుకొండలు, నరసింహా రావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవ సదస్సు

తెనాలి: గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవ సదస్సు శనివారం తెనాలిలో జరగనుంది. డెమోక్రటిక్ ఏపీజీఎస్‌డబ్ల్యుఎస్ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు స్థానిక బస్‌స్టేషన్ దగ్గర్లోని గ్రాండ్ స్మామాట్ హోటల్ ఫంక్షన్‌హాలులో జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. అసోసియేషన్ రాష్ట్ర జేఏసీ చైర్మన్ జి.జోసెఫ్ కిషోర్, రాష్ట్ర కో–ఆర్డినేటర్, ఏపీ స్టేట్ డిటిజల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.సతీష్ హాజరవుతారని వివరించారు. అసోసియేషన్ భవిష్యత్ కార్యాచరణ వివరిస్తారని ప్రకటిస్తారని తెలిపారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: కాళీమాత దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో శివాజీచౌక్‌లో శుక్రవారం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్ మాట్లాడుతూ ప్రతినెలా 2వ శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, నక్కా వెంకటేశ్వర్లు, కందేపి సీతారామయ్య, బోగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరంభమైన ప్రతిష్టా మహోత్సవం



తెనాలి: పట్టణ నాజరుపేటలోని శ్రీ శృంగేరీ శ్రీ విరూపాక్ష పీఠపరిపాలిత శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో గాలిగోపురం, కలశ ప్రతిష్టాపన మహోత్సవాలు శుక్రవారం ఆరంభించారు. తూర్పువైపున నూతనంగా నిర్మించిన గాలిగోపురం, కలశ ప్రతిష్టాపన శనివారం ఉదయం 9.09 గంటలకు శ్రీశృంగేరి విరూపాక్ష పీఠపాలిత శ్రీపరశివానంద భారతిస్వామిచే జరగనున్న విషయం తెలిసిందే. ఇందుకోసం శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలను జరిపారు. కలశాభిషేకం నిర్వహించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కె.చంద్రశేఖర రెడ్డి పర్యవేక్షించారు.

క్రీడలపై ఆసక్తి ఏర్పరచుకోవాలి

భాష్యం విద్యాసంస్థల సబ్ జడ్ఈవో రాము



తెనాలిఅర్బన్: క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలని భాష్యం విద్యాసంస్థల సబ్ జడ్ఈవో రాము పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని భాష్యం స్కూల్ ఆధ్వర్యంలో ఒలంపస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బుర్రిపాలెం రోడ్డు నుంచి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో వివిధ రకాల ఆటలను ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ రకాల క్రీడలను నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ మోహన్‌దాస్, హెచ్ఎం మోతీ, పీఈటీలు నాని, పవన్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులు

మంగళగిరి టౌన్: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జరగనున్న వివిధ అభివృద్ధి పనులను త్వరతగతిన ప్రారంభించాలని దేవదాయ ధర్మదాయ శాఖ గొల్లపూడి విజయవాడ కమిషనర్, దేవదాయ శాఖ స్థపతి, ఇంజినీరింగ్ విభాగ అధికారులు ఆదేశించారు. శుక్రవారం స్వామి వారి ఆలయాన్ని వారు సందర్శించారు. ప్లాన్, అంచనాలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అత్యవసరంగా ప్రణాళికలు, ఎస్టిమేట్‌లను తయారు చేసి పనులను ప్రారంభించాలని ఆదేశించారు.

ఆరోగ్యకర జీవనశైలితో మానసిక ఆరోగ్యం



మాట్లాడుతున్న ఆరోగ్యాధికారి డాక్టర్ హనీఫ్

తెనాలిరూరల్: ఆరోగ్యకర జీవనశైలి, ఆహారపు అలవాట్లతో మానసిక ఆరోగ్యం కలుగుతుందని సంగంజాగర్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ హనీఫ్ అన్నారు. ప్రపంచ మానసిక దినోత్సవం సందర్భంగా మండలంలోని సంగంజాగర్లమూడి గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ హనీఫ్ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం ప్రపంచ మానవాళి హక్కు అని తెలిపారు. మానసిక ఆరోగ్య ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ శారీరక ఆరోగ్యాన్ని సైతం మానసిక పరిస్థితే నిర్దేశిస్తుందన్నారు.

అవగాహన లేని ఎందరో మానసిక ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. తెనాలి జిల్లా వైద్యశాల ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ గడచిన దశాబ్దకాలంగా మానసిక సమస్యలు అధికంగా నమోదవుతున్నాయని అన్నారు. ప్రతిరోజు శారీరక వ్యాయామం, నడక, ధ్యానం ద్వారా మానసిక వత్తిడిని జయించాలని సూచించారు. స్టాఫ్ నర్సు శ్రావణి, సత్తార్, బాలయ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సినీజగత్తులో ధృవతార సాలూరి రాజేశ్వరరావు

జయంతి సభలో డాక్టర్ కె.రామరాజు



బొల్లిముంత కృష్ణకు సత్కారం

తెనాలి: ది తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రముఖ సినీ సంగీత దర్శకుడు సాలూరి రాజేశ్వరరావు జయంతిని నిర్వహించారు. స్థానిక నాజరుపేటలోని వివేక మహిళా కాలేజి ప్రాంగణంలో ఏర్పాటైన సభకు సొసైటీ కార్యదర్శి బొల్లిముంత కృష్ణ అధ్యక్షత వహించారు. గేయరచయిత డాక్టర్ కె.రామరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సాలూరి రాజేశ్వరరావు సంగీత ప్రతిభను సోదాహరణంగా వివరిస్తూ, ఆయన సినీజగత్తులో ధృవతారగా నిలిచారని చెప్పారు. నాలుగు దశాబ్దాలపాటు ఆయన సంగీతం సమకూర్చిన వందకు పైగా సినిమాల్లోని పాటలు ఇప్పటికీ ప్రజల ఆదరణ పొందుతున్నటుట గుర్తుచేశారు. సాలూరి సొంత హార్మోనియంను బహుమతిగా పొందిన సంగీత దర్శకుడు, సొసైటీ కార్యదర్శి బొల్లిముంత కృష్ణను సత్కరించారు. తొలుత రాజేశ్వరరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సంగీత కళాకారుడు నీలాంబరం సాలూరి రాజేశ్వరరావు స్వరపరచిన పాటలను ఆలపించారు. సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు, మురళి, రాంబాబు, నవీన్, గణేష్ పాల్గొన్నారు.

ఐదు నెలలుగా వేతనాల్లేక వెతలు



సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు, సిబ్బంది

ఫిరంగిపురం: పంచాయతీ కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు లేక నానా అవస్థలు పడుతున్నారని వారికి జీతాలు చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్మికుల జీతాలు చెల్లించాలని కోరుతూ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అనేకసార్లు దీనిపై అధికారులకు తెలియజేసినా వచ్చినప్పుడు ఇస్తామంటూ చెబుతున్నారన్నారు. ధరలు పెరుగుతుండటంతో వారి జీతాలు రూ.15 వేలకు పెంచాలని, వాటితో పాటు ప్రైవేట్ ఫండ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. గుర్తింపు కార్డులు, సెంట్ టీజర్లు సబ్బులు, నూనె బ్లౌజులు కూడా వారికి అందజేయాలని చెప్పారు. ఈనెల 24 లోపు జీతాలు చెల్లించకుంటే సమ్మెదిశగా అడుగువేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆయన వెంట పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

నూతన పని గంటల విధానాన్ని ఉపసంహరించుకోవాలి



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు

తాడేపల్లి రూరల్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పనిగంటల విధానాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాడేపల్లిలో శుక్రవారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని తుంగలో తొక్కి చంద్రబాబు ప్రభుత్వం 13 గంటల పని విధానాన్ని తీసుకురావడం అన్యాయమన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు 18 మాసాల నుంచి కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు ఇవ్వకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. సంబంధిత అధికారులు వెంటనే వీటిని ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పారిశుద్ధ్య కార్మికులు సంతోషం, నాని, మేరీ, శ్రీను, కంచర్ల అనూష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



గెలుపొందిన వడ్డేశ్వరం జెడ్పీ స్కూల్ విద్యార్థులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని గుడ్‌షెపర్డ్ కాన్వెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైల్డ్ ప్రొటెక్షన్ కో ఆర్డినేటర్ విద్య మాట్లాడుతూ 2012 అక్టోబర్ 11న ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించిందని పేర్కొన్నారు. నాటి నుంచి అంతర్జాతీయ స్థాయిలో ఆడపిల్లల హక్కులు, సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న లింగ వివక్ష, వేధింపులె, అన్ని రంగాల్లో మగవారితో సమానంగా ఆడవారికి కూడా స్థానం కల్పించాలని చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఐద్వా నాయకులు డి. శ్రీనివాస కుమారి మాట్లాడుతూ బాలికల హక్కుల గురించి బాల్య వివాహాల నిర్మూలన గురించి పోరాడాలన్నారు. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ రాధిక మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి, మనుగడకు ఆడపిల్లలు చాలా అవసరమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.జోజప్ప, ఉపాధ్యాయులు, గుడ్ షెపర్డ్ సిబ్బంది అనూష, పోతురాజు, అనిల్ కుమార్, నాగమణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓడీఎఫ్ నగరంగా మంగళగిరి

మంగళగిరి టౌన్: మంగళగిరిని బహిరంగ మల విసర్జన రహిత(ఓడీఎఫ్) నగరంగా ప్రకటిస్తున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంటీఎంసీ పరిధిలో విస్తృతమైన సర్వే నిర్వహించినట్లు పేర్కొన్నారు. దాని ఆధారంగా మొత్తం పట్టణాన్ని తాత్కాలికంగా బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతంగా ప్రకటించినట్లు వివరించారు. ఈ తాత్కాలిక స్థితిని శాశ్వతంగా ధ్రువీకరించడానికి, ప్రజల నుంచి అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని అన్ని కార్యాలయాలకు నోటీసులు ఇచ్చామన్నారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదులు ప్రజల నుంచి రాలేదని నగరపాలక సంస్థ ప్రస్తుత చట్టాలు, నిబంధనల ప్రకారం ఎంటీఎంసీని అధికారికంగా శాశ్వతంగా బహిరంగ మల విసర్జనరహిత ప్రాంతంగా ప్రకటించామన్నారు.

మురుగు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: మురుగు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. పూలేకాలనీలో శుక్రవారం ఆమె పర్యటించారు. పేదల ఇళ్ల వద్ద అపరిశుభ్రత ఉండటాన్ని గమనించిన ఆమె వారికి పలు సూచనలు చేశారు. రోడ్లపై ఎటువంటి వ్యర్థాలను వేయవద్దని, కార్మికులకు దానిని అందజేయాలని సూచించారు. అనంతరం పూలే కాలనీలోని ఎస్‌టీపీ ప్లాంట్‌ను పరిశీలించారు. ఆమె వెంట ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్, పలువురు ఏఈలు, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

రేపు మానసిక వ్యాధుల ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: మానసిక వ్యాధులపై ఈనెల 12వ తేదీ ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినెల రెండో ఆదివారం ‘స్పెషలిస్టులతో ఉచితవైద్య శిబిరాల్లో భాగంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి.సేవకుమార్, పావులూరి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు 2/1 బ్రాడీపేట లోని ఎస్.హెచ్.ఓ భవనంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ముగిసిన ప్రవచనాలు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై శ్రీ మద్భగవద్గీత అష్టాదశ అధ్యాయంలోని మోక్షసన్న్యాసయోగంపై నిర్వహిస్తోన్న ఆధ్యాత్మిక ప్రవచనాలు శుక్రవారంతో ముగిశాయి. తొలుత ఆలయ పాలకమండలి కమిటీ సభ్యులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు.

విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన



మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని నిర్మల ఫార్మసీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్, ఉన్నత భారత అభియాన్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఇప్పటం గ్రామంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ నరేష్‌బాబు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, తడిపొడి చెత్త ఏర్పాటు, ప్లాస్టిక్ వినియోగ నిర్మూలన వంటి అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు దిశా నిర్దేశం చేశామన్నారు. విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి స్వచ్ఛత అవసరం వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. ఇప్పటంలోని ప్రాథమిక పాఠశాలలో మానవహారంగా ఏర్పడి విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఇప్పటం గ్రామ సచివాలయ కార్యదర్శి నందం బాలపరమేశ్వరరావు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మధుబాబు, ఎన్ఎస్ఎస్ స్టూడెంట్ కో ఆర్డినేటర్లు బిందు ప్రియాంక, రజియాబేగం, మధుమిత, ప్రజ్ఞ, సాయి స్నిగ్ధ, హలీమా నౌరి తదితరులు పాల్గొన్నారు.

నగర పరిశుభ్రతకు సహకరించండి

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని నిర్మల ఫార్మసీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్, ఉన్నత భారత అభియాన్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఇప్పటం గ్రామంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ నరేష్‌బాబు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, తడిపొడి చెత్త ఏర్పాటు, ప్లాస్టిక్ వినియోగ నిర్మూలన వంటి అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు దిశా నిర్దేశం చేశామన్నారు. విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి స్వచ్ఛత అవసరం వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. ఇప్పటంలోని ప్రాథమిక పాఠశాలలో మానవహారంగా ఏర్పడి విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఇప్పటం గ్రామ సచివాలయ కార్యదర్శి నందం బాలపరమేశ్వరరావు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మధుబాబు, ఎన్ఎస్ఎస్ స్టూడెంట్ కో ఆర్డినేటర్లు బిందు ప్రియాంక, రజియాబేగం, మధుమిత, ప్రజ్ఞ, సాయి స్నిగ్ధ, హలీమా నౌరి తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాల కోసం ధర్నా

దుగ్గిరాల: కౌలు రైతు కార్డులేని వారికి పంట రుణాలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు అన్నారు. శుక్రవారం దుగ్గిరాల మండలం చిలువూరు యూనియన్ బ్యాంకు ఆవరణలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు కార్డు లేని వారికి ఈ–క్రాపు నమోదు చేసిన వారికి జె.ఎల్.జె గ్రూపులు ద్వారా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం బ్యాంకు మేనేజర్ పి.భాను తేజకు సమస్యను తెలియజేయగా బాకీ లేని వారికి రుణాలు ఇస్తామని సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఆరోగ్య బీమా అందరికీ అవసరం

ఎంపీపీ పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి



ఆరోగ్య బీమాపై సూచనలిస్తున్న ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: ప్రతి ఒక్కరు ఆరోగ్య బీమా చేయించుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఎటువంటి రూపాయి కట్టకుండా పూర్తిస్థాయిలో వైద్యం తీసుకోవచ్చని ఎంపీపీ పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు ఉపసర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమంపై మూడు రోజుల ట్రైనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ శంకరయ్య మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబం హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం వల్ల ఎటువంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన ఐదు లక్షల వరకు వైద్యం చేయించుకోవచ్చని తెలియజేశారు. ఇన్సూరెన్స్ తీసుకోవడం వల్ల కలుగు ప్రయోజనాలను వివరించారు. ఎంపీపీ పద్మావతి మాట్లాడుతూ శిక్షణ అనంతరం సర్పంచులు ఉప సర్పంచులు ఎంపీటీసీలు పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాలలో ప్రజలకు హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం వల్ల కుటుంబానికి ఎటువంటి మేలు జరుగుతుంది అన్న అంశాలను వివరించి ఎక్కువమంది హెల్త్ ఇన్సూరెన్స్‌లు చేయించుకునే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భార్గవ్, మండల పరిషత్ ఈవో మూర్తి వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు ఎస్‌టీపీ ప్లాంట్ ప్రారంభం

మున్సిపల్ కమిషనర్ జాగారపు రామ అప్పలనాయుడు



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ రామ అప్పలనాయుడు

తెనాలిఅర్బన్: పూలే కాలనీలో నూతనంగా నిర్మించిన ఎస్‌టీపీ ప్లాంట్‌ను శనివారం ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జాగారపు రామ అప్పలనాయుడు పేర్కొన్నారు. పూలే కాలనీలోని ప్లాంట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై ఆరాతీసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌టీపీ ప్లాంట్ వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. కలుషిత నీటిని శుద్ధి చేసి మొక్కలకు, ఇతర అవసరాలకు ఉపయోగించే విధంగా ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. ఉదయం 11 గంటలకు జరిగే ప్రారంభోత్సవ వేడుకల్లో కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికలు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈ శ్రీకాంత్, పబ్లిక్ హెల్త్ డీఈ శివరామకృష్ణ, ఏఈలు సునీల్, జానీ బాషా, ఫణీ, పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థుల కోసం ‘స్టార్స్’

తాడికొండ: గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉన్నత చదువులకు పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశంతో వీఐటీ వ్యవస్థాపకుడు జి. విశ్వనాథన్ సంకల్పం మేరకు విశ్వవిద్యాలయంలో స్టార్స్ (సపోర్ట్ అడ్వాన్స్‌డ్ ఆఫ్ రూరల్ స్టూడెంట్స్) ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించామని విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఎస్.వి. కోటరెడ్డి తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ చదివి జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థులు (26 జిల్లాల నుంచి ఒక విద్యార్థి, విద్యార్థిని) చొప్పున ఎంపిక చేసి వీఐటీ–ఏపీ విశ్వవిద్యాలయంలో ఉన్నతవిద్యతో పాటు వసతిని, ప్రాథమిక వైద్యం పూర్తి ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు.